క్లుప్తంగా

515 కేసుల పరిష్కారం

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 515 కేసులు పరిష్కారమయ్యాయి. పీడీఎం కోర్టులో సీసీ ఐపీసీ 44, సివిల్ ఓఎస్ 3 కేసులు పరిష్కరించారు. సీసీ ఎక్సైజ్ 76 కేసుల్లో రూ.3.80 లక్షల జరిమానా విధించారు. ఏడీఎం కోర్టులో సీసీ ఐపీసీ 31, సివిల్ 1, సెకండ్ క్లాస్ కోర్టులో ఎస్‌టీసీ 343 కేసుల్లో రూ.4,84,210 జరిమానా విధించారు. ఎస్‌బీఐకి సంబంధించిన 17 కేసుల్లో రూ.13.90 లక్షల జరిమానా విధించారు. లోక్ అదాలత్‌లో నర్సంపేట సివిల్ కోర్టు జడ్జి శిరీష, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, న్యాయవాదులు కొడిదల సంజయ్‌కుమార్, అంబటి శ్రీనివాస్, తండా సారంగపాణి, మోటూరి రవి, కొమ్ము రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

లింగాపురం యువకుడికి రెండు ఉద్యోగాలు


నియామకపత్రం అందుకుంటున్న శశిధర్ (ఫైల్)

చెన్నారావుపేట: రెండు ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను సాకారం చేశాడు మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన యువకుడు. మేరుగు ఎల్లయ్య–సుభద్ర ప్రమీల దంపతులకు పవన్‌కుమార్, శశిధర్ ఇద్దరు కుమారులు ఉన్నారు. పవన్‌కుమార్ హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ వెహికల్ బ్యాటరీ కంపెనీ నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు శశిధర్ బీటెక్ పూర్తిచేసి మే నెలలో ఏఈఈ, ఏఈ ఉద్యోగాలకు పరీక్షలు రాశాడు. రెండు ఉద్యోగాలు సాధించి ఏఈఈ గెజిటెడ్ పోస్టును ఎంపిక చేసుకున్నాడు. ఈనెల 26న హైదరాబాద్‌లోని జలసౌధలో డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిత చేతుల మీదుగా ఉద్యోగం ఆర్డర్ కాపీని అందుకున్నాడు. 27న కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సబ్ డివిజన్ నీటిపారుదల శాఖ ఏఈఈగా బాధ్యతలు చేపట్టాడు.

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థి ప్రతిభ

సంగెం : వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇ.వర్షిక్ ప్రతిభ చాటాడు. అతడు ప్రదర్శించిన 'హైడ్రో సైకిల్' జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా వర్షిక్ వరంగల్ ఎంపీ కావ్య, కలెక్టర్ సత్యశారద చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. వర్షిక్‌ను ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

బెస్ట్ ఇన్నోవేటర్‌గా హరీశ్

సంగెం : మండలంలోని కాట్రపల్లికి చెందిన అప్పులభక్తుల హరీశ్ జిల్లా స్థాయిలో బెస్ట్ ఇన్నోవేటర్‌గా ఎంపికయ్యాడు. వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ మేళాలో ఆయన ప్రదర్శించిన ఉడెన్ ట్రెడ్ మిల్‌తో బెస్ట్ ఇన్నోవేటర్‌గా ఎంపికయ్యాడు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద చేతుల మీదుగా హరీశ్ ప్రశంసాపత్రం అందుకున్నారు.

విరాళం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ఆవరణలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం హన్మకొండకు చెందిన పిల్లారిశెట్టి లక్ష్మీదేవి–లక్ష్మీశ్రీనివాస్‌రావు దంపతులు శనివారం రూ.15,116 విరాళం అందజేశారు. ఈ మేరకు దంపతులు ఆలయ కమిటీ బాధ్యులకు నగదు అందజేశారు. అనంతరం దంపతును ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు.

ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి

రాయపర్తి : గుర్తు తెలియని వ్యక్తి ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సూర్యపేట డిపోకు చెందిన బస్సు హన్మకొండకు వెళ్తుండగా రాయపర్తి బస్టాండ్‌కు చేరుకోగానే గుర్తు తెలియని వ్యక్తి రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో బస్సు అద్దం పగిలింది. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'ఎస్ఆర్ఆర్' ఆధ్వర్యంలో చీరల పంపిణీ

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ‌లేతాకుల రంగారెడ్డి, తదితరులు మండలంలోని మైలారంలో సుమారు 900 మంది మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. బొడ్డెమ్మ పండగ సందర్భంగా మహిళలకు చీరలు అందిస్తున్నట్టు తెలిపారు. మండల ప్రజలకు ఫౌండేషన్ తరఫున సేవలు అందించనున్నట్టు చెప్పారు. ఫౌండేషన్ ప్రతినిధులు మధూకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రత్నాకర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు హెచ్‌ఎం సదానందం, పీఈటీ రఘువీర్ శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు.

భవన నిర్మాణానికి ఇంకెన్నాళ్లు..?

- అద్దె భవనంలోనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
- భూమి పూజ చేసి 8 ఏళ్లు


శిలాఫలకం (ఫైల్)


అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

నర్సంపేట రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తలపెట్టిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఇంకెన్నాళ్లు పడుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో 2016లో నాటి మంత్రులు కడియం శ్రీహరి అజ్మీర చందూలాల్ వేసిన శిలాఫలకం నేటికీ వెక్కిరిస్తూనే ఉంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుండగా అద్దె భవనంలోనే కొనసాగుతుండడం ఇబ్బందికరంగా పరిణమించింది.

నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం మండలాలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్ పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే జరుగుతుంది. కాగా కార్యాలయానికి మొదటి నుంచి అద్దె భవనాల్లోనే ఏర్పాటు చేశారు. కాగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రత్యేక భవనం ఉండాలనే ఉద్దేశ్యంతో 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో స్థలం కేటాయించగా నాటి మంత్రులు కడియం శ్రీహరి, అజ్మీర చందూలాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు 8 ఏళ్లు గడచినా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

శిలఫలకానికే పరిమితం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం శిలాఫలకానికే పరిమితం అయ్యింది. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కార్యాలయంలో ఉద్యోగులకు, పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టాలి.

–గూడూరు సందీప్, నర్సంపేట వాసి

భగత్‌సింగ్ జయంతి వేడుకలు


నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు


ఖానాపురం : విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చింతకుంట్ల వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొగిలిచర్ల సందీప్, పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు కొమ్ముక రవి మాట్లాడారు. భగత్‌సింగ్ స్ఫూర్తి కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ కాలేజీ కమిటీ అధ్యక్షుడు జి.సాత్విక్, నాయకులు రాజు, వెంకటేశ్, మహేశ్, రాణి, సమత, మమత, సరిత, రాజేందర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రవికుమార్ విద్యార్థులకు నోట్‌బుక్స్, నీట్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాసుల రవికుమార్, భూమ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలతో చైతన్యం

నర్సంపేట : మహాకవి గుర్రం జాషువా రచనలతో ప్రజలను చైతన్యవంతం చేశారని ప్రొఫెసర్ గద్ద వెంకటేశ్వర్లు, దళిత రత్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ఎస్‌కె.జావిద్, స్వేరో వ్యవస్థాపక సభ్యుడు సదానందం తెలిపారు. పట్టణంలోని పాకాల సెంటర్‌లో గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను దళిత ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. జాషువా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల కోకన్వీనర్ గుంటి వీరప్రకాశ్, కోకన్వీనర్లు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతే లక్ష్యం



గీసుకొండ : మహిళల ఉన్నతే లక్ష్యంగా 9 మందితో గ్రామ స్థాయిలో కమిటీలు వేయనున్నట్టు జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ కూసం రాజమౌళి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సహాయక కమిటీలకు శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సమస్యలను అధిగమించేలా కమిటీలు పని చేయాలని ఆకాంక్షించారు. మహిళలు చట్టాలు, సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ కమిటీలకు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో సర్వోదయ సభ్యులు అక్తర్, వనిత తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి


నర్సంపేట రూరల్ : టీకాలు వేస్తున్న వైద్యులు

నర్సంపేట రూరల్ : రేబిస్ నివారణ కోసం కుక్కలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని నర్సంపేట ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్.రెడ్డి తెలిపారు. ప్రపంచ రేబీస్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సంపేటలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏడీ బీఎస్.రెడ్డి, బానోజీపేట పశు వైద్యాధికారి విద్య, శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం బీఎస్.రెడ్డి, డాక్టర్ విద్య మాట్లాడారు. అవగాహన కల్పించారు. 23 కుక్కలకు, 19 గేదెలకు టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, పశువైద్య సిబ్బంది రబ్బాని, రాజ్‌కుమార్, గోపాలమిత్ర రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో డాక్టర్ మంజీలాల్ కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 20 పెంపుడు కుక్కలకు టీకా వేశామన్నారు.

రేబిస్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం : రేబిస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెంపుడు, వీధి కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

వర్ధన్నపేట : విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించాలని డీసీఈబీ జిల్లా కార్యదర్శి జి.కృష్ణమూర్తి ఆకాంక్షించారు. మండలంలోని కట్ర్యాలలోని ప్రభుత్వ స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి జోన్ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలకు ఎంఈఓ, స్కూల్ హెచ్‌ఎం శ్రీధర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. క్రీడాపోటీల్లో 32 పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గనగా అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి సోమన్న, పీఈటీలు వెంకటేశ్వర్లు, రఘువీర్, వెంకటేశం, శ్రీనివాస్, కట్ర్యాల ఏపీసీ చైర్మన్ కేతమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

రాయపర్తి : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెర్కవేడులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెర్కవేడుకు చెందిన ధర్మారపు మణికంఠ స్వామి (18) ఇంటర్ ఫెయిల్ అయ్యి ఇంటి వద్దే ఉంటున్నాడు. సిగరెట్, మద్యంకు అలవడడంతో శుక్రవారం నాడు తండ్రి యాకయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన మణికంఠ స్వామి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తల్లిదండ్రులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సీడ్‌బాల్స్ తయారీతో విద్యార్థుల్లో అవగాహన


సీడ్‌బాల్స్ తయారీ పరిశీలిస్తున్న సంపత్

గీసుకొండ : సీడ్‌బాల్స్ తయారీతో విద్యార్థుల్లో అవగాహన పెరగనుందని వరంగల్‌లోని కాశిబుగ్గ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఆ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారీపై శనివారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోటి మొక్కలు పెంచి ప్రపంచ రికార్డు సాధించాలనే లక్ష్యంతో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన పది వేల సీడ్‌బాల్స్‌ను గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న అడవుల్లో, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వెదజల్లుతామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్, శ్రీకాంత్, హెచ్‌ఎంలు సాంబయ్య, కుమారస్వామి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన నాయికోటి లక్ష్మిని ఆగంతకుడు కొట్టి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధిత మహిళ కథనం ప్రకారం.. ఎలుకుర్తి హవేలీకి చెందిన లక్ష్మి మరో ఇద్దరు మహిళలతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయానికి తిరుగు ప్రయాణంలో లక్ష్మీపురం–ఎలుకుర్తి హవేలీ రోడ్డులో ఇంటికి నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వారికి లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మబలికాడు. ఇద్దరిని వాహనంపై ఎక్కించుకుని ఎలుకుర్తి హవేలీలో దించిన అనంతరం నడుచుకుంటూ వస్తున్న లక్ష్మి వద్దకు వచ్చి ఆమెను కొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లాడు. గొలుసు విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి'

పర్వతగిరి : మాదిగ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు క్షమాపణ చెప్పాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా ధర్మయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశానికి మహేందర్ హాజరై మాట్లాడారు. కేవలం మాలల ఓట్లతోనే గెలిచానని చెప్పిన క్రమంలో ఎమ్మెల్యే నాగరాజు తక్షణమే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో గెలవాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, అంబేడ్కర్ ఫిలాసఫీ అవార్డు గ్రహీత బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వర్ధన్నపేట : విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని నల్లబెల్లి శివారులో చోటుచేసుకుంది. పర్వతగిరి మండలంలోని గోపనపెల్లికి చెందిన నాంపెల్లి శ్రీను నల్లబెల్లిలో ఓ రైతు వద్ద వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాడు. శనివారం అతడి ఆవు బక్కరాగడి వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ తీగలు తెగి పడి ఉండగా విద్యుత్ తీగలకు తాగి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వెటర్నరీ డాక్టర్ రాజేందర్‌కు, విద్యుత్ లైన్‌మెన్ ఐలయ్య ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని రైతు శ్రీను వాపోయాడు. ప్రభుత్వం తనకు పరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


రామస్వామి


శ్రీధర్

పర్వతగిరి : స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహంకాళి రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శాంతికిరణ్, కౌన్సిలర్లుగా రాజు, సుభాషిణి, కార్యదర్శులుగా స్వామి, గుగులోతు కిషన్, శ్రీరాముల విజయకుమార్, ఆడిట్ కన్వీనర్‌గా రవీందర్, ఆడిట్ సభ్యులుగా రఘు, సాయిరాంకుమార్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవిందరావు మాట్లాడారు. సుమారు 20 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సర్వీస్ రూల్స్ సమస్య త్వరలో పరిష్కరిస్తామని ఇతర సంఘాలు ప్రకటించడం మోసగించడమేనని చెప్పారు. సమావేశంలో నాయకులు సాయికిరణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయం


నర్సంపేట : సీనియర్స్ సిటిజన్లను సన్మానిస్తున్న సీడీపీఓ, తదితరులు


చెన్నారావుపేట : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

నర్సంపేట : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యక్రమాలు చేపడుతోందని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఓ హేమలత తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నర్సంపేట–4 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోషణ సంబరాలకు సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఓ హేమలత అతిథులుగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను అభినందించారు. ఐఎంఏ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ భారతి మాట్లాడుతూ వయోవృద్ధులైన మహిళలకు వైద్యపరీక్షలు చేసి మూడు నెలల పాటు ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. అనంతరం 37 మంది సీనియర్ సిటిజన్లను శాలువాలతో సన్మానించారు. టీహెచ్ఆర్ పిల్లల తల్లి బొల్లు శ్రావణి బాలామృతంతో తయారు చేసిన కేక్‌ను సీనియర్ సిటిజన్స్ కట్ చేశారు. తొలుత మహిళలు వివిధ పోషకాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ప్రీ స్కూల్ పిల్లలకు గేమ్స్ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమ, ఝాన్సీరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మార్త, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పావని, జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, మునిసిపల్ కోఆప్షన్ సభ్యురాలు నాయిని సునీత, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ మాట్లాడారు. పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. తృణ ధాన్యాలు, చిరుధాన్యాలు, ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, డీఆర్‌డీఏ డీపీఎం దయాకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ హేమలత, తహసీల్దార్ ఫణికుమార్, ఏపీఎం ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే గుండెకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న భాను రేఖ

నర్సంపేట రూరల్ : మానసిక ప్రశాంతతతోనే గుండెకు మేలు జరుగుతుందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ భాను రేఖ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భాను రేఖ మాట్లాడారు. ఒళ్లు నొప్పులు, నీరసం, నిద్రలేకపోవడం, ఆందోళన, కోపం, డిప్రెషన్, మతిమరుపు, తదితరాలు గుండుపోటు రావడానికి కారణమని చెప్పారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు కనీసం 30–40 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. గుండె సంరక్షణ కోసం ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనూష, ఎస్తార్ రాణి, ప్రియాంక, జోత్స్న, పూజ, ఏఓ సురేశ్, ఏసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

చెన్నారావుపేట : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీవాణి, ఏపీఎం ఈశ్వర్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆశాజ్యోతి మండల సమాఖ్య 14వ వార్షిక మహాసభ శనివారం నిర్వహించారు. తొలుత కోశాధికారి ముంజ లక్ష్మీ ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. సమాఖ్యలో రూ.49 లక్షల 33 వేల లావాదేవీలు నిర్వహించినట్టు తెలిపారు. మిగులు ఆదాయం రూ.3 లక్షల 88 వేల 822 ఉందని చెప్పారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీవాణి, ఏపీఎం ఈశ్వర్ మాట్లాడారు. సభ్యులు ఐక్యంగా ఉంటూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బ్యాంకుల ద్వారా రూ.50 కోట్ల రుణాలు తీసుకుని మెరుగైన ప్రగతి సాధించారని అభినందించారు. 30 గ్రామాలకు చెందిన సంఘాలు ఆదాయ అభివృద్ధిలో పోటీ పడడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తొలిసారిగా బ్యాక్ యాడ్ ఫౌల్ట్రీ మదర్ యూనిట్‌ను, 53 కోళ్ల యూనిట్లను ఏర్పాటు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలు కడుదూరి హైమ, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధ, పారిజాతం, సీసీలు కట్టయ్య, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం


లబ్ధిదారులకు పత్రాలు ఇస్తున్న నాయకులు

నెక్కొండ : ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారెంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకం కింద మంజూరైన సబ్సిడీ గ్యాస్ ధృవీకరణ పత్రాలను మండల కేంద్రంలోని రేషన్ షాపులో శనివారం వారు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గోరంట్ల వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రాచకొండ రఘు, పొలిశెట్టి భానుప్రకాశ్, ఈదునూరి ప్రభాకర్, రావుల మహిపాల్‌రెడ్డి, కొత్తకొండ గణేశ్, రామారపు రాము, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


నెక్కొండ : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కల్పన

నెక్కొండ : దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అర్చన కోరారు. మండలంలోని అలంకానిపేట పరిధిలోని వెంకటాపురం సబ్ సెంటర్‌లో అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పలువురికి రక్తపోటు, డయాబెటిస్, క్యాన్సర్, కీళ్లనొప్పులు, గుండెపోటు, పక్షవాతం తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ అర్చన మాట్లాడారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యం నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమ, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వైద్యపరీక్షలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంచాయతీ సిబ్బందికి డాక్టర్ సరోజ ఆధ్వర్యంలో శనివరాం వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేసిన అనంతరం సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్, సీహెచ్ఓ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.